నేరాల నియంత్రణకు చర్యలు

బాచుపల్లి ఎస్‌హెచ్‌ఓ ఉపేందర్



నిజాంపేట్: బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాల అదుపునకు చేపడుతున్న చర్యలు, సైబర్ క్రైమ్ కేసుల సత్వర పరిష్కారానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు.? ఓపెన్ బార్లుగా మారిన వైన్‌షాపులను ఏ విధంగా కట్టడి చేస్తారు.? పని చేయని సీసీ కెమెరాల మరమ్మతుల విషయంపై ఏ విధంగా స్పందిస్తారు.? అపార్ట్‌మెంట్ కేసుల విషయంలో జాప్యం ఎందుకు జరుగుతోంది.? తదితర అంశాలపై బాచుపల్లి ఎస్‌హెచ్‌ఓ ఉపేందర్‌తో 'సాక్షి'ప్రత్యేక ఇంటార్వ్యూ.

ప్రశ్న: ఇటీవల సైబర్ క్రైమ్ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. వీటిపై ప్రజలకు ఏ విధంగా అవగాహన కల్పిస్తున్నారు?

జవాబు: వాస్తవమే బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో కనీసం నెలకు 10 కేసులు నమోదు అవుతున్నాయి. ప్రజలు తమ ఫోన్‌లకు వచ్చిన లింక్‌లను వెంటనే ఓపెన్ చేయవద్దు. ఏమైన అనుమానం వస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

ప్రశ్న: ఆన్‌లైన్‌లో డబ్బులు పోయిన వారు ఎవరికి, ఎక్కడ ఫిర్యాదు చేయాలి?

జవాబు: ఆన్‌లైన్ ద్వారా డబ్బులు తమ అకౌంట్ల నుంచి పోయిన వారు, తాము మోసపోయామని గుర్తించిన వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నం.1930కు వెంటనే కాల్ చేసి ఫిర్యాదు చేయాలి. అప్పుడు సంబంధిత అకౌంట్ ఫ్రీజ్ అవుతుంది. రికవరీకి అవకాశం ఉంటుంది. రూ.50వేల లోపు డబ్బులు పోగొట్టుకున్న వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. రూ.50వేల కంటే ఎక్కువగా మోసపోతే సైబర్‌క్రైమ్ గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి.

ప్రశ్న: బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చాలా చోట్ల సీసీకెమెరాలు పనిచేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.?

జవాబు: అవును 20 శాతం వరకు సీసీ కెమెరాలు పని చేయడం లేదు. పోలీసుల ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లోని ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. కాని వాటిలో పని చేయని వాటికి మరమ్మతులు ఎవరు చేయడం లేదు. వాటిని కూడా ఆయా కాలనీల వారితో మాట్లాడి మరమ్మతులు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: ప్రధాన రోడ్లపై ఉన్న వైన్ షాపులు ఓపెన్ బార్లుగా మారి షాపుల ముందు తీవ్రమైన ట్రాఫిక్ జ్యాం అవుతుంది. దీనిపై ఎలాంటి చర్యలు తీసుంకుటారు?

జవాబు: వైన్ షాపుల వద్ద ట్రాఫిక్ నియంత్రణకు ట్రాఫిక్ పోలీసుల సమన్వయంతో పరిష్కారిస్తాం. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. అందు కోసం వైన్ షాపు నిర్వాహకులతో చర్చించి కేసులు నమోదు చేస్తాం.

పన్నులు చెల్లించండి..
అభివృద్ధికి సహకరించండి

- కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉపకమిషనర్ నరసింహా
- పన్నుల వసూళ్లపై దృష్టి సారించాం





కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం

కుత్బుల్లాపూర్: ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందుపరిచే విషయంలో బిజీగా ఉన్న అధికారులు ఇప్పుడు పన్నుల వసూళ్లపై దృష్టి సారించారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో 2024 మార్చి 31 వరకు వ్యాపార, వాణిజ్య, గృహ సంస్థల నుంచి సుమారు రూ.92కోట్ల పన్నుల రూపంలో వసూలు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు రూ.55 కోట్లకు పైగా వసూలు అయ్యాయి. మరో రూ.37కోట్లు వసూలు కావాల్సి ఉంది. దీంతో జంట సర్కిల్లో ఉప కమిషనర్లు మల్లయ్య, నరసింహులు బిల్ కలెక్టర్లకు రోజువారి టార్గెట్ విధించి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సూపరింటెండెంట్‌లతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఆయా సర్కిళ్ల వారీగా జనవరి టార్గెట్ పెట్టుకొని పన్నుల వసూళ్లకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

ఈనెల పన్ను వసూలు లక్ష్యం..

◆ కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో మొత్తం తొమ్మిదిమంది బిల్ కలెక్టర్లకు రోజువారీగా రూ.26.10 లక్షల చొప్పున టార్గెట్ విధించి జనవరి 31వ తేదీ వరకు రూ.8.09 కోట్లు వసూలు చేయాలని సూచించారు.

◆ గాజులరామారం సర్కిల్ పరిధిలో మొత్తం 7 మంది బిల్లు కలెక్టరు విధుల్లో ఉండగా ప్రతిరోజు టార్గెట్ రూ.15.71 లక్షలు నిర్ణయించి జనవరి 31 వరకు రూ.4.87 కోట్లు వసూలు చేయాలని టార్గెట్ పెట్టుకున్నారు.

మార్చి 31 వరకు వందశాతం వసూలు చేస్తాం: డీసీ

కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో పనులు చెల్లించే వారికి ఇప్పటికే బిల్ కలెక్టర్లు ఇంటింటికీ తిరిగి పనులు చెల్లించే విషయంపై సంక్షేమ సంఘాలతో సమావేశం అయ్యారని సర్కిల్ ఉప కమిషనర్ నరసింహ ×సాక్షితో అన్నారు. దీని ద్వారా ఇప్పటి వరకు రూ.35కోట్లు పన్నుల రూపంలో వచ్చాయన్నారు. మార్చి 31 వరకు తప్పకుండా వంద శాతం పన్నులు వసూలు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.

◆ ఇప్పటి వరకు ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల ప్రక్రియ పూర్తి చేశామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు వచ్చే వరకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసుకుంటామని పేర్కొన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సిబ్బందితో ఎప్పటికప్పుడు సమావేశం నిర్వహించి ఎన్నికల అధికారుల సూచనలను పాటిస్తామన్నారు. అందుకు తమ టీమ్ సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కోరారు.

రవాణా శాఖ కార్యాలయ ప్రారంభోత్సవానికి ఆహ్వానం


ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన ఏఎంవీఐ కిషోర్

కుత్బుల్లాపూర్: ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును బుధవారం మేడ్చల్ జిల్లా ఏఎంవీఐ కిషోర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 18వ తేదీన ఇబ్రహీంపట్నంలో జరిగే రవాణా శాఖ కార్యాలయ ప్రారంభోత్సవానికి రావాలని ఎమ్మెల్సీకి ఆహ్వాన పత్రికను అందజేశారు. అదే విధంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని కాలనీలు, బస్తీల ప్రజలు శంభీపూర్ కార్యాలయంలో ఎమ్మెల్సీ రాజును కలిసి సమస్యలను వివరించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

అభినందనలు



దుండిగల్: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఎన్నికైన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్‌గౌడ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూర్ వెంకట్‌లను బుధవారం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు నర్సారెడ్డి భూపతిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని అభిలాషించారు. పార్టీ కోసం అంకితభావంతో పని చేసే వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. బల్మూర్ వెంకట్‌ని ఎమ్మెల్సీకి ఎంపిక చేయడమే ఇందుకు నిదర్శమన్నారు.

ఆటో నుంచి పడి మృతి చెందిన మహిళ ఆచూకీ లభ్యం

డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కూతురి ఫిర్యాదు

జగద్గిరిగుట్ట: ఆటోలో నుంచి కిందపడి మృతి చెందిన గుర్తు తెలియని మహిళ ఆచూకీ లభ్యమైంది. జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం హరిప్రియ బార్ సమీపంలో ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ రోడ్డుపై పడి తలకు తీవ్రగాయాలు కావడంతో మృతి చెందింది. కాగా సదరు మహిళ సిద్దిపేట్ జిల్లా మల్లంపల్లికి చెందిన మక్క ఎల్లమ్మ (55)గా గుర్తించారు. ఎల్లమ్మ మంగళవారం ఎల్బీనగర్‌లో ఉంటున్న తమ కుమారుడి అయ్యప్ప దీక్ష ఇరుముడి కార్యక్రమానికి వచ్చింది.

◆ ఆ తర్వాత ఆల్విన్‌కాలనీ ఈస్ట్‌సాయినగర్‌లో ఉంటున్న కుమార్తె గీత ఇంటికి వచ్చేందుకు ఎల్బీనగర్‌లో బస్సు ఎక్కి జగద్గిరిగుట్ట బస్టాప్‌లో దిగింది. అనంతరం ఆల్విన్ కాలనీకి వెళ్లేందుకు (టీఎస్ 07యూఏ 7546) ఆటో ఎక్కింది. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా హరిప్రియ బార్ సమీపంలో రోడ్డుపై పడటంతో ఎల్లమ్మ తలకు తీవ్ర గాయమై మృత్యువాత పడింది. నిర్లక్ష్యంగా ఆటో నడిపిన డ్రైవర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మృతురాలి కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చిత్తారమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తి


ముస్తాబైన ఆలయం

ఈనెల 19 నుంచి 27 వరకు జాతర


ఆలయంలో కొలువైన అమ్మవారు

సుభాష్‌నగర్: గాజులరామారం చిత్తారమ్మ దేవి జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్యగౌడ్ తెలిపారు. ఈనెల 19 నుంచి 27వ తేదీ వరకు జాతర కొనసాగనుందన్నారు. ఈనెల 21న ప్రధాన జాతరకు భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఇప్పటికే పోలీస్, ట్రాఫిక్, విద్యుత్, సర్కిల్, జలమండలి తదితర శాఖల అధికారులతో సమావేశమయ్యామని తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరామన్నారు. ఆలయ కమిటీ సైతం అన్ని జాగ్రత్తలు తీసుకుంటుందని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని భౌరంపేట్ సెక్షన్ ఏఈ సాయికిరణ్ ఓ ప్రకటనలో తెలిపారు. భౌరంపేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని వజ్రా విల్లాస్, ల్యాండ్‌మార్క్-2, ప్రణీత్ బ్లూమ్స్, డీజే హోమ్స్, సుకృతి హోమ్స్, కీర్తి హోమ్స్, అక్షయ డెవలపర్స్, ప్రవీత్ ప్రణవ్ విల్లాస్ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు.

◆ **ప్రగతినగర్ సెక్షన్ పరిధిలో..**
ఎలీప్ ఫీడర్ పరిధిలోని ప్రగతి స్కూల్, మధుర నగర్ రోడ్డు, బచ్‌పన్ స్కూల్, అపురూపా కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ప్రగతినగర్ ఏఈ పేర్కొన్నారు.

◆ **నిజాంపేట్ సెక్షన్ పరిధిలో..**
నిజాంపేట్, రాజధాని స్కూల్, జర్నలిస్ట్ కాలనీ, భండారి లేఅవుట్, భవ్యాస్, శ్రీనివాస కాలనీ ఫీడర్ల పరిధిలోని జర్నలిస్ట్ కాలనీ, నిజాంపేట్ ప్రధాన రోడ్డు, గ్రీన్ ఎవెన్యూ పల్లంపల్లి విల్లాస్, భవ్యాష్ ఆనంద, శ్రీనివాస హౌసింగ్ సొసైటీ, భండారి లేఅవుట్, రెడ్డి ఎవెన్యూ, పాత గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని నిజాంపేట్ సెక్షన్ ఏఈ తెలిపారు.

◆ **బాచుపల్లి సెక్షన్ పరిధిలో..**
సాయినగర్ ఫీడర్ పరిధిలోని వీఎన్ఆర్ కళాశాల, సాయినగర్, రాజీవ్‌గృహకల్ప ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శాంత కుమార్ పేర్కొన్నారు.

ఫిబ్రవరి 1, 2వ తేదీల్లో 'వర్కింగ్ కమిటీల' సమావేశాలు

లిబర్టీ: భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తున్న ఆల్ ఇండియా కాన్ఫడరేషన్ ఆఫ్ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఏఐటీయూసీ వర్కింగ్ కమిటీ సమావేశాలు ఫిబ్రవరి 1, 2వ తేదీల్లో జరగనున్నాయని జాతీయ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి మారగోని ప్రవీణ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే వర్కింగ్ కమిటీ సమావేశాలు బెంగళూరులోని సిరిపూర్ పార్క్ రోడ్డు శేషాద్రిపురంలో జరుగుతాయన్నారు. తొలి రోజైన ఫిబ్రవరి 1వ తేదీన ఉదయం 11 గంటలకు బహిరంగ సభ ఉంటుందన్నారు.మధ్యాహ్నం 3గంటలకు వర్కింగ్ కమిటీ సమావేశాలు ప్రారంభమై 2వ తేదీ 4గంటలకు సమావేశాలు ముగుస్తాయన్నారు.

సుచిత్రలోని ఆధార్ సెంటర్ వద్ద ఉదయం 7గంటలకు టోకెన్ల కోసం వేచి ఉన్న జనం



ఆధార్ సెంటర్లను పెంచండి

- ప్రతిరోజు 100మందికే ఆధార్ సేవలు
- తెల్లవారుజాము నుంచే ఆధార్ సెంటర్ల వద్ద పడిగాపులు
- టోకెన్ తీసుకుని సవరణలు చేయించుకుంటున్న ప్రజలు
- ప్రత్యామ్నాయ మార్గం చూపడంలో అధికారులు విఫలం


అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వృద్ధులు

సుభాష్‌నగర్: ప్రభుత్వ పథకాలు, విద్యా, ఉద్యోగ ఇతర పనుల నిమిత్తం ప్రస్తుత రోజుల్లో ఆధార్ తప్పనిసరి. కొత్త ఆధార్ కార్డు పొందడానికి, పేర్లు చిరునామాలు సవరణ చేయించేందుకు చాలామంది ఈ-సేవ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. దీంతో కొన్ని రోజుల నుంచి సుచిత్రాలోని ఈ-సేవల వద్ద 24గంటల పాటు పిల్లాపాపలతో లైన్‌లో నిలబడుతున్నారు. ఈ-సేవ సిబ్బంది రోజుకు 100 మందికే అవకాశం ఇవ్వడంతో ఇలా రోజులపాటు తమ వంతు వచ్చే వరకు లైన్‌లో నిలబడుతున్నారు.

పసిపాపలతో గంటల తరబడి లైన్‌లో..

ఇలా స్థానిక నుంచే కాకుండా బోయిన్‌పల్లి, అల్వాల్, షాపూర్‌నగర్, మేడ్చల్, కొంపల్లి ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి తరలివచ్చి రోజులపాటు లైన్‌లో నిలబడి ఆధార్‌కార్డు పొందుతున్నారు. ఈ-సేవ సిబ్బంది రోజుకు 100 మందికి మాత్రమే ఉదయం టోకెన్లు ఇస్తోంది. సాయంత్రం వరకు వారికి మాత్రమే ఆధార్ కార్డుల సేవలను అందిస్తున్నారు. దీంతో ఆ టోకెన్ పొందడానికి రాత్రి నుంచే వచ్చి పిల్లాపాపలతో గంటల తరబడి లైన్‌లో వేచి ఉంటున్నారు.

అధికారుల విఫలం...

ప్రభుత్వ ప్రకటించిన ఆరు పథకంలో ఏది కావాలన్నా ఆధార్ తప్పనిసరి. చాలా మందికి ఎక్కడ చూసినా ఆధార్‌లో తప్పులు ఉండగా.. చాలా మంది పిల్లలకు ఆధార్‌కార్డులు లేవు. ఇటీవల ఆరు పథకాల్లో భాగంగా ముఖ్యంగా రేషన్‌కార్డులో కొత్త పేర్లను పొందుపరచడానికి ఆధార్ కార్డు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ఈ-సేవ ఆధార్‌కార్డ్ సెంటర్లకు జనాలు పోటెత్తారు. కానీ సంబంధిత అధికారులు వారికి అదనంగా మరిన్ని ఆధార్ సెంటర్లను పెంచి ప్రత్యామ్నాయ మార్గం చూపడంలో ఘోరంగా విఫలమయ్యారు.

10 సవరణలు చేసుకోవాలంటే 10 రోజులు నిలబడాల్సిందే..

ఆధార్‌లో తప్పులను సవరణ చేయించుకోవడానికి ఈ-సేవ వద్ద గంటల తరబడి క్యూలో నిలిచి అక్కడికి వెళ్తే కేవలం ఒక్క సవరణ మాత్రమే చేసి పంపిస్తున్నారని కొంతమంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పుట్టిన తేదీ తప్పును సరి చేసి అదేవిధంగా తప్పుల తడకగా ఉన్న చిరునామా సవరణ చేయాలంటే మరోసారి లైన్‌లో నిలబడి రావాల్సిందేనని ఈ-సేవ సిబ్బంది చెప్పడంతో అలా ఎన్నితప్పులు ఉంటే అన్ని అన్ని రోజులు క్యూ కట్టాల్సి వస్తుందని సిబ్బంది తీరుపై మండిపడుతున్నారు.

అధికార యంత్రాంగం ఏం చేస్తోంది?



ప్రస్తుత రోజుల్లో ఏ పని కావాలన్నా ఆధార్ కార్డు తప్పనిసరి. ఉదయం 5గంటల నుంచి వచ్చి లైన్‌లో నిలబడ్డాం. కనీసం కాలకృత్యాలు తీర్చుకోలేని పరిస్థితి. రోజుల తరబడి ఆధార్ కార్డు కోసం ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొంటుంటే అధికార యంత్రాంగం ఏం చేస్తోంది. జనాల తాకడం దృష్టిలో పెట్టుకొని అదనంగా కౌంటర్లు ఇవ్వాల్సిన ఆలోచన కూడా లేదా. సంబంధిత అధికారులు దృష్టి సారించి అదనంగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలి.
– వెంకటేశ్వరరావు, బోయిన్‌పల్లి

3 నెలలుగా బిల్లులు పెండింగ్

- డబ్బులు అందక ఇబ్బందులు పడుతున్న యజమానులు
- అప్పులు తెచ్చి విధులు నిర్వర్తిస్తున్న వైనం
- సిల్ట్ కార్టింగ్ వాహన యజమానులను పట్టించుకోవాలని వినతి

చింతల్: తెలంగాణ ఉద్యమకారులకు దళిత బంధు పథకం కింద గత ప్రభుత్వం హైదరాబాద్ మహానగర మురుగునీటి పారుదల (జలమండలి) నుంచి సిల్ట్ కార్టింగ్ వాహనాలను అందజేసింది. కానీ 3 నెలలుగా వాటికి బిల్లులు చెల్లించకపోవడంతో లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. గతేడాది నవంబర్ 1వ తేదీ సుంచే బస్తీలలో తిరిగి డ్రైనేజీ వ్యర్థాలను తొలగించి తరలిస్తున్నామని వాహన యజమానులు పేర్కొంటున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదని సీల్ట్ కార్టింగ్ వాహనాల యజమానులు చెబుతున్నారు. అప్పులు తెచ్చి మరి విధులు నిర్వర్తించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో వాహనానికి నెలకు రూ.1.20 లక్షల ఖర్చు ఉంటుందన్నారు. అందులోనే డ్రైవరు, ఒక క్లీనర్, వాహన యజమాని, డీజిల్ ఖర్చు సరిపెట్టుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఈ వాహనాలు అందుబాటులోకి వచ్చి రెండున్నర నెలలు గడిచినా ఇప్పటికీ ఒక రూపాయి అందలేదని వాపోతున్నారు.


బిల్లులు మంజూరు కాకపోవడంతో నిరసన వ్యక్తం చేస్తున్న దళితబంధు సిల్ట్‌కార్టింగ్ వాహన యజమానులు

బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటాం..



కుత్బుల్లాపూర్ డివిజన్‌కు మొత్తం 10సెక్షన్లు ఉన్నాయి. మొత్తం 10 సీల్ట్ కార్టింగ్ వాహనాలను జలమండలి మంజూరు చేసింది. ఒక్కొక్క వాహనానికి కేటాయించిన బిల్లులను పూర్తిస్థాయిలో ఉన్నతాధికారులకు పంపించాం. జలమండలి ప్రధాన కార్యాలయం నుంచి నిధులు కేటాయించిన తక్షణమే దళితబంధు వాహన లబ్ధిదారులకు బిల్లులు క్లియర్ చేస్తాం.
– ఎం.శ్రీధర్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జీఎం

అభివృద్ధిలో పరిశోధనలు కీలకం

రాయదుర్గం: ఏ సంస్థలోనైనా అకడమిక్ ఎదుగుదలలో పరిశోధనలు ప్రముఖపాత్ర పోషిస్తాయని 'మనూ' స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ అబ్దుల్ వాహిద్ పేర్కొన్నారు. మనూలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (సీఎస్ అండ్ ఐటీ) విభాగం ఆధ్వర్యంలో 'కంప్యూటర్ సైన్స్‌లో ఎమర్జింగ్ రీసెర్చ్ ట్రెండ్స్' అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక రంగంలో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయని, వాటిని ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. సమకాలీన కంప్యూటర్ సైన్స్ పరిశోధనను రూపొందించే తాజా పురోగతులు, పద్ధతులు, ఇంటర్ డిసిప్లినరీల సహకారంపై మరింత అవగాహన అధ్యాపకులకు అవసరమన్నారు. సీఎస్ అండ్ ఐటీ విభాగం అధిపతి ప్రొఫెసర్ ప్రదీప్‌కుమార్ పరిశోధనా కార్యకలాపాల గురించి వివరించారు.

గీతం అధ్యాపకుడికి సెర్చ్ పరిశోధనా ప్రాజెక్టు

పటాన్‌చెరు: గీతం విశ్వవిద్యాలయంలోని సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొ.డాక్టర్ సుధాకర్ సింఘాకు భారత ప్రభుత్వం సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ బోర్డ్ (సెర్చ్) పరిశోధనా ప్రాజెక్టును మంజూరు చేసినట్టు బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్ జిల్లాలో కృత్రిమ మేథ/ మెషీన్ లెర్నింగ్ ఆధారంగా భూగర్భ జలాల గుణాత్మక, పరిమాణాత్మక మూల్యాంకనం ప్రాజెక్టును, రూ.32.03 లక్షల గ్రాంట్ తో సెర్చ్ రీసెర్చ్ గ్రాంట్‌గా 36 నెలల కాల వ్యవధితో మంజూరు చేసినట్లు వివరించారు.భూగర్భ జల వనరుల స్థిరమైన అభివృద్ధి దిశగా భూగర్భ జలాల గుణాత్మక, పరిమాణాత్మక అంచనా కోసం కృత్రిమ మేథ, మెషిన్ లెర్నింగ్ పద్ధతులను ఉపయోగించడంలో డాక్టర్ సింఘాకు ఉన్న నైపుణ్యం ఈ పరిశోధనలో తోడ్పడనున్నట్టు పేర్కొన్నారు.గీతం అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, కోర్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ వి.రామశాస్త్రి, వివిధ విభాగాధిపతులు, పలువురు అధ్యాపకులు సింఘాకు అభినందనలు తెలిపారు.

విగ్రహ ధ్వంసం హేయమైన చర్య

- ప్రొ. జయశంకర్ విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాలి
- ఓయూ జేఏసీ నేత దరువు అంజన్న డిమాండ్


ఎల్లమ్మబండలో ప్రొ.జయశంకర్ విగ్రహం కూల్చివేసిన ప్రదేశంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించిన అంజన్న, శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ తొలి దశ ఉద్యమనేత, తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొ. జయశంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేయటం హేయమైన చర్య అని.. బీఆర్ఎస్ కార్యకర్త ఈ దారుణానికి ఒడిగట్టడం విడ్డూరంగా ఉందని ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ నేత, కాంగ్రెస్ పార్టీ నాయకుడు దరువు అంజన్న పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ వద్ద ఉన్న ప్రొ. జయశంకర్ విగ్రహాన్ని మంగళవారం గోవింద్ అనే వ్యక్తి ధ్వంసం చేసిన విషయాన్ని తెలుసుకొని బుధవారం స్థానిక నాయకులు, జేఏసీ నేతలతో కలిసి దరువు అంజన్న సంఘటనా స్థలానికి చేరుకొని ప్రొ.జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ జాతిపిత ప్రొ. జయశంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేయటం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతకాలం నుంచి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తగా కొనసాగుతున్న గోవింద్ కన్నంరెడ్డి అనే వ్యక్తి మద్యం మత్తులో బందరాయితో మోది విగ్రహాన్ని ధ్వంసం చేశారన్నారు. వెంటనే అతడిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్విన్‌కాలనీ డివిజన్ అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

సచిన్‌కు అవకాశం కల్పించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి రిజర్వుడు స్థానాన్ని గోమాస సచిన్‌కు కేటాయించాలని ఎస్సీ యువశక్తి తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ నిట్టురి రవిమాదిగ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ప్రజా సమస్యలపై నిత్యం స్పందిస్తూ అనేక సేవ కార్యక్రమాలతో ప్రజలతో మమేకమైన సచిన్ ప్రజల మన్ననలను పొందారన్నారు.

పర్యవేక్షణ లోపం.. పనుల్లో జాప్యం

- గతేడాది జులైలో పనులకు శంకుస్థాపన
- సెప్టెంబర్‌లో బాక్స్‌డ్రెయిన్ నిర్మాణానికి శ్రీకారం
- నవంబర్‌లో పనులను నిలిపేసిన కాంట్రాక్టర్
- ఇళ్ల పక్కనే గోతులు తీసి ఉండటంతో జంకుతున్న జనం
- పిల్లలు ఆడుకుంటూ అందులో పడిపోతారేమోని ఆందోళనలో స్థానికులు

రంగారెడ్డినగర్: అధికారుల పర్యవేక్షణ లోపం.. కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యంతో అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారాయి. పనులు ప్రారంభమై ఆరు నెలలు కావస్తున్నా ఇంకా తది దశకు చేరుకోలేదు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గిరినగర్‌లోని ఇంటి నం.21-93 నుంచి టిగ్రో టూలింగ్ సిస్టమ్స్, గిరినగర్ మండల ప్రజాపరిషత్ పాఠశాలల వద్ద వర్షపునీరు నిల్వ ఉండకుండా సాఫీగా ఉండేందుకు జులై 2023లో రూ.90 లక్షల జీహెచ్ఎంసీ నిధులతో బాక్స్ డ్రెయిన్ పనులకు స్థానిక ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

ఎన్నికల నోటిఫికేషన్‌తో పనులకు బ్రేక్..

◆ అయితే సదరు పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ ఎట్టకేలకు సెప్టెంబర్ నెలలో సాఫీగా పనులకు శ్రీకారం చుట్టాడు. స్థానికంగా ఉన్న పోచమ్మగుడిని ఆనుకని టిగ్రోటూలింగ్ సిస్టమ్స్ పరిశ్రమ వరకు రోడ్డు పక్కన గొయ్యి తీసి అక్కడక్కడా శ్లాబ్‌లు వేశారు. అయితే నవంబర్‌లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడంతో పనులకు బ్రేక్ పడింది. ఎన్నికలు పూర్తయి కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా నేటికీ పనులు మాత్రం చేపట్టడం లేదు.


డ్రెయిన్ శ్లాబ్ కోసం ఇనుప చువ్వలు బిగించి వదిలేసిన దృశ్యం

పట్టించుకోని అధికారులు..

◆జంట సర్కిళ్ల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పనుల విషయంలో కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేయాల్సిన సంబంధిత అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. దీంతో కాంట్రాక్టర్లకు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. గిరినగర్‌లోని బాక్స్ డ్రెయిన్ పనుల నేపథ్యంలో సదరు కాంట్రాక్టర్ శ్లాబ్ వేసేందుకు ఇనుప చువ్వలను ఏర్పాటు చేసి వదిలేయడంతో ఆడుకునే సమయంలో ఎక్కడ తమ చిన్నారులు గాయాల పాలవుతారోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంత మేర శ్లాబ్ వేసి మరికొంత భాగంలో వదిలేయడం విమర్శలకు తావిస్తోంది.



గిరినగర్‌లో శిలాఫలకం
గిరినగర్ పోచమ్మ ఆలయం వద్ద అసంపూర్తిగా డ్రెయిన్ పనులు

త్వరలోనే ప్రారంభిస్తాం..



బాక్స్ డ్రెయిన్ నిర్మాణంలో జాప్యం జరుగుతున్న మాట వాస్తవమే. డ్రెయిన్ నిర్మాణ విషయంలో ఓ పరిశ్రమ యాజమాన్యం తమ స్థలం గుండా పనులు చేపడుతన్నారంటూ అడ్డు తగులుతున్నారు. దీంతో మరో పక్క పనులు ప్రారంభించలేకపోయాం. త్వరలోనే సమస్యలను అధిగమించి బాక్స్ డ్రెయిన్ పనులను ప్రారంభిస్తాం.
– కృష్ణచైతన్య, సర్కిల్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్

గిరినగర్ ఎంపీపీ పాఠశాల వద్ద మొదలు కాని పనులు..

గిరినగర్ మండల పరిషత్ పాఠశాల వద్ద బాక్స్‌డ్రెయిన్ పనులు ఇంకా రూపకల్పన దాల్చలేదు. డ్రెయిన్ ఏర్పాటు చేసేందుకు తెచ్చిన పైపులను గిరినగర్ పోచమ్మ ఆలయం సమీపంలోని రోడ్డు వద్ద డంప్ చేసి పత్తా లేకుండా పోయారు. దీంతో ఈ పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయో.. ఎప్పుడు పూర్తి చేస్తారో అధికారులే చెప్పాలని స్థానికులు పేర్కొంటున్నారు.


రోడ్డు పక్కన డంప్ చేసిన డ్రెయిన్ పైపులు